కొత్తకాలనీలో చిల్డ్రన్స్ పార్క్

- వేగంగా జరుగుతున్న నిర్మాణ పనులు
- 2018–19లో మంజూరైన రూ.1.36 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు

ఇల్లెందు: పట్టణంలోని కొత్త కాలనీలో చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణం సాగుతోంది. టీయూఎఫ్ఐడీసీ 2018–19లో మంజూరైన రూ.1.36 కోట్ల నిధులతో పార్క్ పనులు చేపట్టారు. కొత్త కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ముఖ్యంగా చిన్నారులకు ఆహ్లాదం పంచేందుకు ఈ పార్క్ ఎంతగానో ఉపయోగపడనుంది. పార్క్‌లో వ్యాయామం కోసం జిమ్, వాకింగ్ ట్రాక్, ఆహ్లాదం కోసం గార్డెన్, అలసట తీరేందుకు గజీబులు, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పార్క్‌లో అక్కడక్కడా సోలార్ లైట్లు వెలుగులు, నీటి కోసం బోర్లు, మోటార్లు కూడా ఏర్పాటు చేయనున్నారు.

పార్క్ చుట్టూ ఫెన్సింగ్..

ఈ చిల్డ్రన్స్ పార్క్ చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేశారు. దీనివల్ల పార్క్‌లోకి పశువులు, జంతువులు రాకుండా రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఆహ్లాదం కోసం పచ్చని మొక్కలు, పూల మొక్కలు కూడా పెంచాలని నిర్ణయించారు. సుమారు రెండు ఎకరాల స్థలంలో పార్క్ నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ బర్త్‌డే వేడుకలు, చిన్నారులు ఆటపాటలతో సందడిగా గడిపేలా ఏర్పాట్లు చేపట్టారు.


కొత్త కాలనీలో నిర్మాణంలో ఉన్న చిన్న పిల్లల పార్క్

వాకింగ్ కోసం ట్రాక్ నిర్మాణం..

కాలనీ ప్రజలు, చిన్నారులు, యువత, వాకర్స్ ప్రతీరోజు వాకింగ్ చేసుకునేలా ట్రాక్ నిర్మాణం చేస్తున్నారు. పార్క్‌లో ఆహ్లాదం, అలసట, సేద తీరేందుకు అందమైన గజీబులు(గుడిశలను పోలిన ఇళ్లు) నిర్మాణం చేస్తున్నారు. పచ్చగడ్డితో లాన్ ఏర్పాటు, వాకింగ్‌లో అలసట కోసం అక్కడక్కడ కూర్చునేందుకు సిమెంట్ బల్లల ఏర్పాటు, వాకర్స్‌తో పాటు సందర్శకుల కోసం అందుబాటులో మరుగుదొడ్లు, బాత్ రూంల నిర్మాణం చేపట్టారు.


సిద్ధమైన గజీబు

ఉపయోగంగా ఉంటుంది..


పార్క్ నిర్మాణం వల్ల కాలనీ ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. చిన్న పిల్లల పార్క్ కావటం అందులో ఆట వస్తువులు ఉండటం వల్ల చిన్నారులు చదువు తర్వాత ఇలాంటి ప్రదేశాలకు చేరి ఆటలు ఆడుకునే అవకాశం ఉంటుంది. స్థానికులు అలసట సమయంలో పార్క్‌లో గడిపే అవకాశం ఉంటుంది.

– నర్సింహా, కొత్త కాలనీ, ఇల్లెందు

కొత్తకళ సంతరించుకుంటుంది..


కొత్త కాలనీ నిర్మాణం జరిగినా ఇక్కడి ప్రజల కోసం ఆహ్లాదకరమైన నిర్మాణాలు చేపట్టలేదు. తాజాగా చిన్నపిల్లలకు పార్క్ నిర్మాణం ఎంతో ఉపయోగంగా ఉంటుంది. చిన్న పిల్లలతో పాటు పెద్దలు ఈ పార్క్‌లో సేద తీరే అవకాశం ఉంటుంది. ఈ పార్క్ నిర్మాణం పూర్తయిన తర్వాత కాలనీకి కొత్తకళ ఉట్టిపడుతుంది.

– రాకేష్, కొత్త కాలనీ, ఇల్లెందు

నెలరోజుల్లో పూర్తి చేస్తాం..


కొత్త కాలనీలో నిర్మాణంలో ఉన్న చిన్నపిల్లల పార్క్ పనులు నెలరోజుల్లో పూర్తి చేస్తాం. ఈ పార్క్‌లో అన్ని వసతులు ఉంటాయి. భవిష్యత్‌లో ఈ పార్క్ కొత్త కాలనీకి కొత్త అందాన్ని చేకూర్చబోతుంది. అందరూ ఆహ్లాదం పొందేలా ఏర్పాట్లు ఉంటాయి. వ్యాయామం కోసం జిమ్ నిర్మాణం కూడా జరుగుతోంది.

– వెంకటేశ్వరరావు, చైర్మన్, మున్సిపాలిటీ

క్లుప్తంగా

ట్రైనీ ఐపీఎస్‌కు సన్మానం


విక్రాంత్‌ను సన్మానిస్తున్న పోలీసులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ కుమార్‌సింగ్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ట్రైనింగ్‌లో భాగంగా ఆయన ఎస్‌హెచ్‌ఓగా మూడు నెలలు విధులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకొని వెళ్తున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కరుణాకర్‌రెడ్డి

సుజాతనగర్: సుజాతనగర్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా డి.కరుణాకర్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన టి.వెంకటలక్ష్మి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో జూలూరుపాడు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కరుణాకర్ రెడ్డికి సుజాతనగర్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు కేటాయించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు ఓబీలలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కె.సారంగపాణి సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు శనివారం కేఓసీలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఓబీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కేఓసీ అధికారులు, ఓబీ కాంట్రాక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. మాట్లాడుతూ... ప్రతీనెల 10వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను పెంచాలని విన్నవించారు. కార్యక్రమంలో గాని నాగేశ్వర్‌రావు, డి.ప్రసాద్, ఓబీ కార్మికులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సెక్యూరిటీ ఆఫీసర్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా వంగా శ్రీనివాస్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన జర్పుల శంకర్ పీవీకే– గని బదిలీపై వెళ్లారు.

సర్వసభ్య సమావేశం

టేకులపల్లి: టేకులపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదాగానే జరిగింది. తడికలపూడి ఎంపీటీసీ బానోతు మౌనిక ఎంపీపీగా ఎన్నికైన తరువాత ఏర్పాటు చేసిన మొదటి సమావేశంలో మొత్తం 14 మంది ఎంపీటీసీలకు గాను 11 మంది, ఒక కోఆప్షన్ సభ్యుడు హాజరయ్యారు. కొంతమంది అధికారులు వచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ... గ్రామాల్లో వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలు లేకుండా సంబంధిత శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, ఎంపీఓ గాంధీ, సూపరింటెండెంట్ సామల శ్రీనివాస్, జయకృష్ణ పాల్గొన్నారు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సంస్థ గుర్తించింది. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఉత్తమ అధికారిగా ఆరెం వెంకటేశ్వర్లు (డిప్యూటీ మేనేజర్, జేకే ఓసీ), ఉత్తమ ఉద్యోగిగా మహ్మద్ సదాత్ హుస్సేన్‌లను సత్కరించనున్నట్లు జీఎం జాన్ ఆనంద్ శనివారం తెలిపారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

జూలూరుపాడు: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అరికట్టాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్కే ఉమర్ మాట్లాడుతూ... నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వల్లోజి రమేష్, కూరాకుల నరసింహారావు, కల్తి రామయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: వ్యవసాయ సీజన్‌లో రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు విక్రయించడం, వారిని మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి మండలంలోని కోయగూడెం గ్రామంలోని విత్తన దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్‌వాయిస్, సేల్స్ రిజిస్టర్ పరిశీలించారు. విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ఎవరైనా బ్లాక్ చేస్తే కేసులు నమోదు చేస్తామని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.


జూలూరుపాడు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

ఇల్లెందురూరల్: విద్యుత్ సరఫరా సంబంధిత సమస్యలపై తమకు ఫిర్యాదు చేయాలని ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందు సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, అత్యవసర పరిస్థితులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, సరఫరాలో సమస్యలు ఉత్పన్నమైతే సమీపంలోని అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇల్లెందు పట్టణ పరిధిలో 9440814145, 9491075367, రూరల్ పరిధిలో 9440814146, 9848792554, గుండాల మండల పరిధిలో 7901678190, 9963039874 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

జూలూరుపాడు: సుజాతనగర్, కొత్తగూడెం రూరల్ సబ్ డివిజన్‌లో విద్యుత్ అంతరాయం, అత్యవసర పరిస్థితులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్, సరఫరాలో సమస్యలను సంప్రదించేందుకు అధికారులకు ఫోన్ చేయాలని ఎన్‌పీడీసీఎల్ కొత్తగూడెం రూరల్ ఏడీఈ ఎండీ యాసిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్- 9491074690, బృందావనం- 9493546428, చంద్రుగొండ-9491074692, మద్దుకూరు-9491075363, పోకలగూడెం -8331017683, జూలూరుపాడు-9491075358, పడమటనర్సాపురం-9492461967, పాపకొల్లు -7416414871, పెంట్లం-9492462322 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టేకులపల్లి: విద్యుత్ వినియోగదారులు ఎదర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫోన్ నంబర్లు ఏర్పాటు చేసినట్లు టేకులపల్లి, బొమ్మనపల్లి విద్యుత్ శాఖల ఏఈలు హట్కర్ దేవా, పి.బుజ్జి కన్నయ్యలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టేకులపల్లి 9491075362, 9440811562, బొమ్మనపల్లి 9492462316, కోయగూడెం 9542264867, బొమ్మనపల్లి 9392388292, 9493546447, బోడు 9494720057 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు

ఇల్లెందు: తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేశారు. అలాగే సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లోనూ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతే కాక మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీఓ, తహసీల్, పోలీస్ స్టేషన్‌తో సహా అన్ని ప్రభుత్వం కార్యాలయాలను విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పించనుండగా.. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉదయం 8గంటలకు జెండా ఎగురవేస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ తదితరులు ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సింగరేణి జీఎం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ, తెలంగాణ తల్లి విగ్రహం నుంచి సింగరేణి స్కూల్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించడంతో పాటు అమరవీరులకు నివాళులర్పిస్తామని జీఎం జాన్ ఆనంద్ వెల్లడించారు.


సింగరేణి స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టేజీ

ఇల్లెందురూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది వేడుకలకు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. గ్రామపంచాయతీ కార్యాలయాలను పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రమాదాల నివారణపై సదస్సు


మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి పద్మావతిఖని(పీవీకే) గనిలో ప్రమాదాల నివారణపై శనివారం జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... సంస్థలోని పలు గనుల్లో కొన్నేళ్లుగా జూన్‌లో ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ఈసారి అలా జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతీ కార్మికుడు, ఉద్యోగి ప్రమాదాల జరగకుండా చూసుకోవడాన్ని కర్తవ్యంగా భావించాలని సూచించారు. అలాగే, విధులకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ అధికారులు తివారి, వెంకటేశ్వరరావు, గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, రక్షణాధికారి ఈ.ఈశ్వరయ్య, పిట్ ఇంజనీర్ సీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

కొత్తగూడెంటౌన్: రౌడీషీటర్లపై నిఘా ఉంటుందని, ఎలాంటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. కొత్తగూడెం టూటౌన్ పరిధి రుద్రంపూర్ మాయాబజార్ ఏరియాలో శనివారం సాయంత్రం డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కొత్తగూడెం సబ్‌డివిజన్‌కు చెందిన 52 మంది పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 40 మోటార్ సైకిల్స్, ఐదు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు తమ పద్ధతులు మార్చుకోవాలని ఎలాంటి ఘర్షణల జోలికి పోవద్దని, మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గంజాయి రవాణా చేసినా, సేవించినా కేసులు నమోదు చేస్తామని కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్ల ప్రమాదాలు, భద్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్‌కుమార్, సబ్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

107 శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: గడిచిన మే నెలలో ఇల్లెందు ఏరియా 107 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ వెల్లడించారు. ఇల్లెందులోని తన కార్యాలయంలో శనివారం మాట్లాడారు. సంస్థ మే నెలకు 3.22 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 3.46 లక్షల టన్నులు ఉత్పత్తి చేయడం ద్వారా 107 శాతం నమోదైందని తెలిపారు. ఇందులో 0.08 లక్షల టన్నులను రైలు మార్గం ద్వారా, 0.93 లక్షల టన్నుల బొగ్గును రోడ్డు మార్గంలో రవాణా చేశామని పేర్కొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆంజనేయ అభయాస్తకం, హనుమాన్ చాలీస, సుందరకాండ ప్రవచనాలు పఠించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ, అన్నదానం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పెద్దబజార్‌లో..


ఇల్లెందురూరల్: కోరగుట్టపై హనుమాన్ జెండా ఎగురవేస్తున్న భక్తులు


పెనగడపలో అన్నదానం


సుజాతనగర్: పూజలో పాల్గొన్న సాబీర్‌పాషా


సింగరేణి(కొత్తగూడెం): రామవరంలో...


పాల్వంచ: ఆలయంలో ప్రత్యేక పూజలు


జూలూరుపాడు: పూజలు చేస్తున్న భక్తులు


పాపకొల్లులో శోభాయాత్ర